# నాకు నచ్చిన నా కథ

"చెట్లు క్షమించవు" కథ నా తొలి రచన. 1954 సం॥లో తెలుగు స్వతంత్ర పత్రికలో పడింది. కాలంతోబాటు సంప్రదాయాల్లోనూ, సాంఘిక సమస్యల్లోనూ, సామాజిక దృక్పథంలోనూ మార్పులు వొస్తూవుంటాయి వాటి ప్రతిబింబాల్ని సమకాలిక రచనల్లో చూస్తూనే వుంటాం. నేనూ చాలా రాశాను కాని యీ చిన్న వ్యంగ్యరచనలో కథావస్తువు కాలంతో బాటు మారేది కాదు. అంచేతనే యీ కథంటే నాకు చాలా యిష్టం.



బి. వి. రమణరావు

## చెట్లు క్షమించవు

ఎల్లుండి బోటనీ పరీక్ష. ఎంత చదివినా తరగటం లేదు. పైగా చదివిందీ చదవందీ ఒక్కలాగే వుంది. ప్రపంచం అంతా బోటనీమయం లాగుంది. దారిలో ఓ పువ్వుల మొక్కో చెట్టో చివరికి గడ్డిపోచో కనబడినా పాఠాలు జ్ఞాపకాని కొస్తున్నాయి. ఓ మూల ఆకలి దంచేస్తోంది, ఇంకా అరమైలు నడవాలి అయ్యర్‌గారి అన్నసత్రానికి. అయినా ఎవరిక్కావాలి వృక్షశాస్త్రం! ఈ చెట్లు

ఎలా పుట్టి ఎలా పెరిగి ఎలా చస్తే మనకేం? ఈ శాస్త్రజ్ఞు లూరుకుంటారా? పెల్లగించి, రిసెర్చి చేసి, సిద్ధాంతీకరించి ప్రబంధాలురాసి మా మొహాన్న పారేస్తారు. పరీక్షల్లో ఇవే మా పాలిట ఏటండాంబులు. కాని ఆలోచిస్తున్నకొద్దీ ఈ వృక్షజీవితానికి మానవజీవితానికి ఏదో సన్నిహిత సంబంధం కనపడుతుంది. ఈ యిద్దరు ప్రాణులూ ఎన్నో కష్టనష్టాలకోర్చి జీవిస్తారు. ఇక జీవిత లక్ష్యంకూడా ఒక్కటే... సంతానం. ఎక్కడ వాళ్ళ వంశం వాళ్ళతోటే అంతరిస్తుందోనన్న వెర్రి మమకారం కొద్దీ మన తల్లితండ్రులు మనల్ని కని యీ భూమిమీద ఎలా పారేశారో అలాగే యీ చెట్లూను

ఇక మన మధ్యతరగతి కుటుంబాల్లో యీ పెళ్ళికొడుకుల గొంతెమ్మ కోరికలు తీర్చడానికి ఆడపిల్లలకి చదువు సంధ్యలనీ, అందచందాలనీ, కట్నాలు కానుకలనీ.. మనం ఎలా బాధపడతామో ఈ చెట్లూ ఈ సీతాకోకచిలుకల్ని ఈ తేనెటీగల్ని మెప్పించటానికి ఆ పువ్వులకు ఆకారమని, రంగని, సువాసనని, ... ఎన్నో పాట్లు పడతాయి.

కని, పెంచి, పెద్దవాళ్ళనిచేసి వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతకగలరనేటంతవరకూ పిల్లల్నిగురించి మనిషిపడే బాధే చెట్లూ పడతాయి. పువ్వు పూసి పువ్వు కాయై, కాయ పండై, ఆ పండులోని తమ సంతానమైన విత్తనాల్లో స్వతంత్ర జీవనానికి కావల్సిన ఆహారాన్ని పరికరాల్ని అమర్చి ఈ విశాల జగత్తులో ఎక్కడో అక్కడ సురక్షితంగా జీవించమని దీవించి తన విత్తనాల్ని వెదజల్లుతుంది. చూడండి ఆ పుత్రవాత్సల్యం! నిజంగా యీ చెట్లకే నోరూ కాళ్ళూ చేతులూ వుంటే తమ తోటి ప్రాణులైన మానవులతో తమ కష్టసుఖాలు చెప్పుకుంటూ చెయ్యగలిగిన సేవయినా వుంటే చేస్తూ అన్యోన్యంగా వుండేవనుకుంటాను. అసలు జె. సి. బోస్ సిద్ధాంతం తలుచుకుంటే మతే పోతుంది. చెట్లు కూడా ఆనందిస్తాయట, ఆలోచిస్తాయట, విచారిస్తాయట కూడాను. తన కొమ్మ నరికేసినపుడు ఒక చెట్టు ఎంత ఏడ్చిందో కళ్ళకి కనబడేటట్టు ప్రయోగంతో నిరూపించి పారేశాడు. ఘోరం! దుర్మార్గుడు! అలా ఏడుస్తుంటే ఎలా చూడగలిగాడో!

ఇలా ఆలోచించుకుంటుంటే హోటల్ వచ్చేసింది. లోపలి కెళ్ళాను. మామూలే. ఇంకా భోజనం చెయ్యవలసినవాళ్ళు ఇరవైమంది 'క్యూ'లో ఉన్నారు. అప్పుడే ఓ లంబోదరుడు తనకంటే ముందర టిక్కట్లు కొన్నారన్న కోపమో ఏమోకాని క్యూలోవున్న ఇరవైమందికేసి ఒక్కసారి తన త్రినేత్రంతో

భస్మీభూతం చేసే ప్రళయరుద్రుడిలాగా ఒకక్క చూపు చూసి బెంచీమీద నా ప్రక్కనే బైటాయిస్తూ నా మీద మరింత అనురాగంతో చూడ్డం మొదలెట్టాడు. అతని వాలకం చూస్తే పలకరించేలాగా కనబడ్డాడు. అయినా ఎందుకయినా మంచి దని, అదీకాక మనిషిని చూస్తే మలాగ్గా ఓ యేనుగును కొరుక్కుతినేసేలా కన బడుతున్నాడు - పైగా దుష్టుడికి దగ్గరగా ఎందుకని, మెల్లగా జరిగి మూలకి నక్కి ఓ కాలు బెంచీమీద మోపి గోడకి జార్లాపడి కళ్ళుమూశాను.

టేబుల్ ముందర చతికిలబడ్డాను. ఎదురుగుండా కూర్చున్నాడో అపర నరసింహావతారం. అప్పుడే ప్లేటు కాళీ చేశాడు. ప్లేటునిండా ఎముకలు మిగి లాయి. ఇంకో ప్లేటు మాంసం తెమ్మన్నాడు. సర్వర్ నన్నడిగాడు 'మాంసా హారమా శాకాహారమా' అని. 'శాకాహారం' అన్నాను. ఎదురుగుండా వున్న మనిషి నా మొహంకేసి చురచుర చూసి సర్వర్‌తో 'వీళ్ళకి ప్రత్యేక స్థలం లేదా?' అన్నాడు. 'లే'దని సర్వర్ లోపలికిపోయి ఒక ప్లేట్లో అన్నం, ఒక ప్లేట్లో ములంకాడ సాంబార్, మరో ప్లేట్లో చిక్కుడుకాయ కూర తీసుకొచ్చి నా ముందర పెట్టాడు. రెండూ కాస్త ఇష్టమయినవేకదా అని భోజనాని కుపక్ర మించే ప్రయత్నంలో ప్లేటు ముందరికి లాక్కుంటున్నాను. అంతవరకూ తల పైకెత్తకుండా తింటున్న ఆ విగ్రహం తల పైకెత్తి 'పర్వాలేదులే' అన్నాడు. నా కర్థం కాలేదు, నేను సాంబారన్నం తింటుంటే అతనికేంపర్వా. తల పై కెత్తి చూశాను. నా ప్లేటు కనబడకుండా చెయ్యి అడ్డంపెట్టుకు తింటున్నాడు.

ఏదో దొంగతనం చేస్తున్నట్లు ప్లేటు చప్పుడు కాకుండా నెమ్మదిగా దగ్గరకి లాక్కుని అన్నం కలుపుకుంటున్నాను.

'ఏ వూరు మీది' అన్నాడు తన చేతివాటునుంచి. అసలు సమాధానం చెప్పకూడదనుకున్నాను ఆ విరసన భావంచూసి. కాని అతని ఆకార పరిమాణమో, ఆ బొద్దు మీసాలో మరి ప్లేట్లో ఎముకలో తెలీదు. నాకు తెలీకుండానే నా చేత సమాధానం చెప్పించాయి. నెమ్మదిగా ఎవళ్ళో గొంతుక నొక్కేస్తున్నట్లు 'చింతపేట' అన్నాను.

'ఏం చేస్తున్నావు?'

'ఇంటర్ పరీక్ష కెడుతున్నాను' సమాధానం తప్పలేదు.

'ఎమిటి గ్రూపు?'

'బోటనీ, జూఆలజీ, కెమిస్ట్రీ.' కొంచెం ధైర్యం వచ్చింది.

'హూఁ... బోటనీయా? అర్థంచేసుకునే చదువుతున్నారా?'

'ఏం?' అన్నాను. అసలు ఈ ప్రశ్న మా బోటనీ ప్రొఫెసర్ అడుగుతే కత్తిలాగా 'ఓ యస్' అనేవాణ్ణి. కాని ఈ మానవపర్వతం ముందర వనగనల్సి వొచ్చింది.

'అహఁ.... అసలు అడుగుతున్నాను. ఊఁ.... మొక్కల్లో ప్రాణం వుంటుందా?'

'ఆ!'

'మరి....నోరో?'

'లేదు.'

'హుఁ... అయితే అంతా తెలిసుండే చేస్తున్నావన్నమాట. అందుకనే ఈ మానవలోకంలో ఈ అన్యాయాలు దుర్మార్గాలు ఈ కరువులు యుద్ధాలు పెచ్చుపెరిగిపోతున్నాయి. వాటి వుసురు తగలకుండా పోతుందా?'

'నే చేసే తప్పేమిటో నా కర్థంకావటంలేదు' అన్నాను ఈ విపరీత ధోరణి అర్థంకాక.

'ఎందు కర్థమౌతుంది? హుఁ.... తరతరాలుగా నీ రక్తంలో జీర్ణించిన అజ్ఞానతిమిరంలో నీ పాపపుణ్య విచక్షణాశక్తి కూడా నశించింది. నీతో సమానంగా పుట్టి పెరిగిన నీ తోటి ప్రాణులయిన ఈ అమాయకపు నోరులేని చెట్లూ చేమల్ని హింసించి వాటి శవాల్ని ముక్కలు ముక్కలుగా చేసి భక్షించి ఆనందించటమే నీ నాగరికత అన్నమాట... అవునా?'


నేను ముద్ద నోట్లో పెట్టుకుందా మనుకుంటుంటే యీ మాటల్తో చెయ్యి దింపేసాను. ఏదో కాస్త ఇష్టమయిన కూరా పులుసూ వందేదనుకుంటే మధ్యన వీడి బాధేమిటి.... పెళ్ళిలో చావుబాజాలాగ. అంతవరకూ మెతుకు కొరికితే మీ తోడు. ఒళ్ళు మండింది.

'అయితే ఏం తిని బతకమంటారు?' అన్నాను కాస్త స్వరం హెచ్చించి.

'మనమంతా జంతుజాతికి చెందిన వాళ్ళం. మనజాతిలో మనం ఒకళ్ళ నొకళ్ళు చంపుకు తినొచ్చు. అది ధర్మం. చూడు చిన్న చేపల్ని పెద్దచేపలు తింటాయి. వాటిని తిమింగిలాలు తింటాయి. పురుగుల్ని కోళ్ళు తింటాయి. ఈ కోళ్ళని, ఈ చేపల్ని, మేకల్ని మనం తింటాం. మనల్ని పులులూ, సింహాలు తింటాయి ఇది మన జాతి ధర్మం. ఏమంటావ్?' అన్నాడు.

'ఊఁ........' అన్నాను ఆలోచన తోచక.

'అలా ఓ జంతువునుంచి ఓ జంతువు తప్పించుకు తిరుగుతుంది. ఆయువు




మూడితే పెద్దజంతువు చేతుల్లో చిక్కుకుంటుంది. ఇది మనవాడి జంతువులు జీవించే విధానం. మాట్లాడవేం?'

ఇంతలో ఒక మెరుపులాంటి ఆలోచన తట్టింది. తక్షణం ఆగ్నేయాస్త్రం లాగా వదుల్తూ 'ఐతే యీ చెట్లూ రంగురంగులతో వింత సువాసనలతో ఎంతో రుచిగా యీ పళ్ళూ కాయలు ఎందుకు కాస్తున్నాయి?' అన్నాను తప్పకుండా యీ దెబ్బతో వెర్రిమొహం వేస్తాడన్న ధైర్యంతో.

'ఓరి అమాయకుడా' అంటూ మొదలెట్టాడు నా ఆగ్నేయాస్త్రాన్ని ఈగని తోలినట్టు లెక్కచెయ్యకుండా. ఒకసారి హుంకారంచేసి గొంతు సవరించుకొని 'ఐతే విను. మొదటినుంచీ యీ వృక్షజాతి మన జంతుజాతి దౌర్జన్యంనుంచి రక్షించుకోవడానికి సామ దాన భేద దండోపాయా లవలంభించింది. అసలు పరిణామ సిద్ధాంతరీత్యా చూస్తే మొదట్లో జంతుజాతికి కూడా నీతి నియమం వుండేవి జంతువులు జంతువుల్నే తినేవి. కాని రాను రాను పిక్కబలం ఎక్కువవ్వడంతోటే తప్పించుకు పారిపోవడం మొదలెట్టాయి. ఓ మూల తనకంటే పెద్దజంతువుల్నుంచి తప్పించుకు తిరగడం, మరో మూల తన ఆకలి తీరడానికి తనకంటే చిన్నజంతువుల్ని తరిమి పట్టుకోవడం మధ్య మధ్య వాటి ప్రణయ విహారాలు... ... ఇలాగ నవరసభరితమైన ఒక దివ్య వాతావరణంలో మహదానందంగా జీవించేవి కొంతకాలానికి కొన్ని నీచజంతువులకి తుచ్ఛ

కామభోగాలమీద ఆసక్తి ఎక్కువయ్యి ప్రకృతిసిద్ధమయిన పౌరుషాభిమానాలు త్యజించి తోకముడిచి పిరికిపందలయ్యి కొండల్లోనూ, గుహల్లోనూ తలదాచుకుంటూ నోరు-వాపీ కాళ్ళు-చేతులూ లేని యీ అమాయకపు వృక్షజాతిని కబళించటం మొదలెట్టాయి.......... అర్థమౌతుందా!'

'అహ .....కానీ నే నడిగిన ప్రశ్న........'

'ఆ విషయానికే వస్తున్నాను. ఏనాడు యీ హేయ పరిణామం జంతువుల్లో కలిగిందో, అనాటినుంచీ వృక్షజాతిలో దుర్బలమైన వరి, జొన్న, గోధుమ, పెసర, కంది మొదలైన మొక్కలు యీ జంతువుల ఆకలికి బలి అయ్యాయి. అది చూసి కంగారుపడి కంద, చేమ, అల్లం, ఉల్లిపాయ, వేరుశెనగ లాంటి మొక్కలు ప్రాణాపాయం రాకుండా వాట్ల ముఖ్యమైన శరీరభాగాల్ని భూమిలో జాగ్రత్తగా పాతిపెట్టి ఏమీ తెలియనట్టుగా నాలుగాకులూ రెమ్మలూ భూమిమీద పెట్టటం మొదలెట్టాయి. ఎంత పరిణామం చెందినా మనిషి తనలో ఆ పందికొక్కు రక్తం పోగొట్టుకోలేదు. ఊరుకున్నాడా! పెల్లగించి తినడం మొదలెట్టాడు. దీనితోటి హడలిపోయి బీరా, పొట్లా, అనపా మొదలైనవి పక్కన కనబడ్డ చెట్టునో పుట్టనో కౌగలించుకొని ఎక్కడో అందకుండా ఆకులవెనుక కాయలు కాయడం మొదలెట్టాయి. కాని వట్టి భ్రమ. తీగలుపళంగా లాగేసి తినడం మొదలెట్టాడు మానవుడు. ఇది చూసి లాగెయ్యటానికి వీల్లేకుండా గట్టి శరీరాల్ని పెంచి వెలగ, మునగ, జామ లాంటి చెట్లు కొమ్మల చివర్ల పళ్ళు కాయటం మొదలెట్టాయి. కానీ కోతులు, కోతుల్లోంచి పరిణామంచెందిన మానవులంకి యివో లెఖ్ఖ. ఇదీ లాభంలేదని కొబ్బరి, తాటి, పోకలాంటి చెట్లు ఈ జంతువులు ఎక్కటానికి వీల్లేకుండా కొమ్మలు విసర్జించాయి. అప్పట్లో పెద్ద జంతువులన్నీ వెర్రిమొహాలేశాయి కానీ ఏం లాభం.... ఇన్నిచేసినా పాపం! ఈ ఉడతల బాధ తప్పించుకోలేకపోయాయి. దీనితోటి ఇది పనికాదని వేప, కుంకుడూ లాంటివి చేదుకాయలూ, చింతా, ఉసిరీ లాంటివి పుల్లటి కాయలూ, వగరుగా కరక్కాయలూ, నోరు మండించేటట్టు మిరపకాయలూ.... యిలా కాయడం మొదలెట్టాయి. కాని మానవుడు తన మేధవృద్ధి అయినకొద్దీ తన హింసాదృక్పథంకూడా ద్విగిణీకృతంచేస్తూ ఈ కాయలన్నింటినీ రుచీ, మందూ, మాతా అనే పేరుతో తన నిత్యజీవితంలో ఉపయోగించుకోవటం మొదలెట్టాడు. వింటున్నావా....తరతరాలుగా మానవాదమృగాలు ఈ వృక్షజాతిని చేసే చిత్రవధాకల్పం.'

"కరతలామలకం చేశారు.... ఇంతకీ తియ్యని పళ్ళు కాయటా మాట కలవిచ్చారు కాదు" అన్నాను కళ్ళు తుడుచుకుని ముక్కు ఎగబీలుస్తూ.

'అదే చెబుతున్నాను బాబూ. కొంచెం ఓర్పు నేర్చుకో. ఎప్పుడయితే మానవాది జంతువుల దుష్టసంకల్పం ముందర తమ ప్రయత్నాలన్నీ విఫల్పం అయ్యాయో అనాడు మామిడి, నారింజ, ద్రాక్ష, సీతాఫలం మొదలైన వృక్షజాలన్నీ ఓ తీర్మానం చేశాయి. ఏమిటా తీర్మానం? తమ వంశాభివృద్ధికి మూలకారణమైన ఆ గింజల్ని గట్టిగానో తియ్యగానో సృష్టించి వాట్లని తియ్యని, మెత్తని పళ్ళలోవుంచి ప్రదర్శించటం. అంటే మానవుడు ఆ తియ్యని సంభాగాన్ని అరగించి గింజల్ని పారేస్తాడని. అవి భూమిమీద పడి మొలకలెత్తుతాయి. ఇంచు బకాసురుడికి బండెడన్నమిచ్చి మనిషిని పరిరక్షించటం లాంటిది. ఇప్పుడర్థమయిందా.... వెర్రితండ్రీ.... కాని.... హుం.... ఇన్ని చేసినా మానవుడికి తృప్తి కలగలేదు జీడిమామిడిపండు తిని గింజలు కూడా బద్దలకొట్టుకు తింటున్నాడు. పనస తొనలతోబాటు గింజలూ, బాదంపండుతోపాటు పప్పూ ...మొదలెట్టాడు. అంతటితో ఆగేనా? ఈ పరమాణుయుగం వచ్చేటప్పటికి మానవుడు వెర్రి ద్వేష ఆవేశాల్తో చెట్లు చెట్ల పళంగానే తినెయ్యటం మొదలెట్టాడు. చూడు .... కొత్తిమీర, మెంతికూర, బచ్చలి మొదలయినవి. ఛీ.. ఛీ.... ఎంత ఉచ్చస్థితిలోనుంచి ఎంత దీనస్థితికి పరిణామం చెందాడు యీ మానవుడు . హుం.... అసలు మృగరాజెవరు తెలుసా ?'

'సింహం' అన్నాను వొణికే గొంతుకతో.


"హుం.... నీ కంతే తెలుసు. ఆనాడు ధైర్యసాహసాల్లో జంతుజాతి కంతటికీ మకుటంలా వర్ధిల్లే మానవుడు ....మిగతా పిరికిజంతువులతోబాటు భోగవిలాసాల్లోపడి నీచ శాకాహారానికి ఒడిగట్టాడు. లేకపోతే తన మేధతో విశ్వాన్నంతా గజగజ వణికించిన మానవుడు మృగరాజపదవిని సింహానికి వదిలెయ్యవలసి వచ్చునా ? ఆనాటి పిరికిపందల సంతతవ్యదంవల్లనే నేడు మనకీ శాకాహారం అబ్బింది ఏదీ ఓ బంగినపల్లి మామిడిపండో ఓ వడ్లమూడి నారింజపండో సింహానికిచ్చి చూడు తింటుందేమో హుం అందుకే వనజరాజు సిబకు ఈ అవకాశం హస్త మస్తిష్కమునే తినును గాక ... విష్ణుశర్మ వెర్రిముహం వేశావు. అర్థం కాలేదూ? ... పండే సింహం ... పుల్లాగ ఎక్కడో ఏరిన గింజలో ఎక్కడో కోసిన మాంసంముక్కో ... సెకండ్ హేండ్ తింటి తినీ ఇంత హీనజీవి కదన్నమాట ... సాల్లో ... పాది ...

తిండే తింటుంది. ఏనాడు మానవుడు నిరపరాధులూ నిస్సహాయులూ అయిన ఆ వృక్షజాతిమీదపడి కబళించటం మొదలెట్టాడో ఆనాడే అతని ధైర్యసాహసాలడుగంటేయి. అంతవరకూ మనిషికి జడిసిన సింహం యీ కక్కుర్తి చూసి లోకువకట్టేసి ఒక్కసారి విశ్వం దద్దరిల్లేలాగ గర్జించి మానవుణ్ణి బెదరగొట్టి వనరాజై కూర్చుంది. దీనికి దృష్టాంతం పురాణంలో చూపెట్టమంటావా. శాకాహారం తినటం మొదలెట్టిన శ్రీమన్నారాయణుడు పిరికివాడై ఆత్మవిశ్వాసం కోల్పోయి ప్రహ్లాదుడ్ని రక్షించటానికి హిరణ్యకశిపుణ్ణి స్వహస్తాల్తో చంపవల్సి వచ్చినప్పుడు చచ్చినట్టు సింహంరూపం దాల్చవల్సివచ్చింది. ఏమంటావ్ !"

ఆయన మొహం ఆవేశంతో ఎర్రబడిపోయింది. గొంతుక రుద్రమై పోయింది కళ్ళు చిచ్చుబుడ్డిలాగా జ్ఞానజ్యోతిని వెదజల్లుతున్నాయి. కేవలం నా అజ్ఞానాంధకారాన్ని పటాపంచలుచేసి విజ్ఞానజ్యోతిని ప్రసాదించటానికి సాక్షాత్కరించిన ఆ దివ్యమూర్తికి నా మనస్సులోనే సాష్టాంగనమస్కార సహస్రము లర్పిస్తూ జ్ఞానోదయంతో ఉక్కిరిబిక్కిరై, ఆవేశంతో గొంతుకడ్డంపడి, నోరు పెగలక, కష్టంమీద కళ్ళుమూసుకుని, ఊపిరి బిగబట్టి 'అవును' అనగలిగాను.

క్షణం నిశ్శబ్దం. కొంపదీసి గబుక్కున మాయమయ్యేడేమోనని అనుమానంవేసి కళ్ళు తెరిచాను. లేదు. ఆ విజ్ఞానవిగ్రహం ఇంకా అక్కడే వున్నాడు. తన వేలితో చూపెడుతూ "అదిగో చూడు" అన్నాడు. ఏ భయంకర సొరంగమేనా కనబడుతుందేమోనని భయంతో గుండెదడ చేత్తో అణుచుకుంటూ నెమ్మదిగా పక్కకి తిరిగాను 'చూడు ఆ చిన్నోడుమొక్క ' కిటికీలోంచి ఒక చిక్కుడు తీగ కిటికీ తలుపుకు తగిలి గాలికి టకటక కొట్టుకుంటోంది 'కనబడిందా పాపం ! ఏ పాపమెరుగని తన జాతి అమాయిక సంతానము అనుభవిస్తున్న దుర్భర చిత్రవధ చూడలేక గుండెలు బద్దలయ్యేటట్టు తల మొత్తుకుంటూ చేస్తున్న ఆ దీనాక్రందన వినబడుతోందా ?' ప్రతి అక్షరం ఇంజక్షన్ సూదుల్లాగా గుచ్చుకుని నా ప్లేట్లోంచి చిక్కుడుగింజలు మొక్కలు మొలిచి తీగలువేసి నా ఎదురుగా నిలబడి చేతులు జోడించి దీనంగా ప్రార్థిస్తున్నట్లు కనబడింది.

"ఆ ములక్కాడ ముక్కలకేసి, నీ ప్లేట్లో అన్నంకేసి ఓసారి చూడు. అందులో ఒక్కొక్కగింజా తల్లికడుపున ఎంత ఆప్యాయంగాపుట్టి ఎంత గారంగా పెరిగిందో. ఈ నాటితో నీ పాపిష్టి ఆకలికి బలవ్వ పోతే ఒక్కొక్కగింజా ఒక్కొక్క మొక్కై పచ్చటి పొలాల్లో చల్లగాలికి గర్వంగా తల వూపుతూ ప్రకృతికి జోలపాడేది. ఈనాడు యీ శిశు శవ సహస్రాల్ని నువ్వు ఆనందంగా ఆరగిస్తుంటే ఆ కన్నతల్లి గర్భశోకం ఎలా వుంటోందో ఆలోచించావా ?" ఆయన




పెద్దింటి అల్లుడయ్యాక మీకు ఉద్యోగం అనవసరం అనిపిస్తుంది!! అంతే!!

కళ్ళు చెమ్మగిల్లాయి.

'స్వామీ అజ్ఞానికి... ....అపరాధిని' అన్నాను మొహం చేతులతో కప్పుకుంటూ.

'మనకి ప్రాణావసరమైన ప్రాణవాయువును మనకిచ్చి బొగ్గు తిని కాలక్షేపంచేస్తూ కొట్టినా తిట్టినా సహించి ఎండ-ఘాతువులో చెంతచేరిన ప్రతి జంతువుకు చల్లదనాన్నిస్తూ పళ్ళు కాయలూ యిస్తూ జీవించే యీ త్యాగజీవులకు నువ్వు చేసే ప్రత్యుపకారం ఏమిటి? వాటి సమక్షంలోనే వాటి సంతానాన్ని భక్షిస్తూ వాటి శరీరభాగాల్ని తెగనరికి వాటితో దూలాలూ, తలుపులూ, కుర్చీలూ, బల్లలూ, బళ్ళు చేయటం ........ పొయ్యిలో పెట్టి బొగ్గుచెయ్యడం... ....ఈ బొగ్గును కుంపట్లో పెట్టి మసిచెయ్యడం ... ....ఇదీ మన ఆనందం; ఔనా?'
ఆయన కన్నీళ్ళు జలజల రాలుతున్నాయి.

'ఓ వృక్షోద్ధారకా.... ....మహాపాపిని... ... కిరాతకుణ్ని'

'విచారించి ఏం లాభం. ఆలోచించు నాయనా.... ... ... ఈ వృక్షజాతికే కాళ్ళూ-చేతులూ, నోరూ వుండి మీ తమ్ముణ్నో చెల్లెల్నో కంచుకుతింటూవుంటే మీ తాతయ్య కాళ్ళూ-చేతులూ తెగ్గొట్టి వాటితో వుయ్యాలచేసి తమ ముద్దుబిడ్డలైన

విత్తనాల్ని వాటిలో పూపుతూంటే, చిన్నచెట్లు ఆకుకోవడానికి నీ బుజాలెక్కి నీ జుట్టుపట్టుకు వేళ్ళాడుతూ సరదాకి ఏ వేలో చెయ్యో కాలో విరగ్గొడుతూంటే నీకెలా వుంటుంది?'

'ఓ వృక్షరక్షణ దీక్షాపరాయణా ! తమ కర్ణకఠోర వాక్శరంగుల భీకర ధ్వని ధాటి కాగలేను' అన్నాను కుంభవృష్టిని కురుస్తున్న ఆయన అశ్రుధారలు నా జేబురుమాలుతో వత్తుతూ

'అబ్బాయి !'

'చిత్తం.'

'ఒక్కసారి నీ హృదయాక్షువులు తెరచి చూడు. అదిగో వృక్షజాతిలో విజృంభిస్తున్న ప్రపంచ విప్లవకల్లోలం. మానవ లోకోద్ధారణకై జన్మించిన వామపక్షబలగం యీనాడు వృక్షజాతిలో 'బ్యాక్టీరియా' రూపంలో జన్మించింది. అదిగో 'సన్ డ్యూ' అదిగో 'బ్లేడర్ వర్ట్' అల్లదిగో 'పిచర్ ప్లాంట్' కనబడుతున్నాయా జంతువుల్ని తినే మొక్కలు. పరిణామం పూర్తవ్వలేదు. చెట్లుకూడా నడుస్తాయి, ఎగురుతాయి, పగ సాధిస్తాయి. భవిష్యత్తు భయానకం చెట్లు క్షమించవు.'

'ఘోరం మహాత్మా ! అదుగో కనబడుతున్నాయి. జంతుశిక్షకి, వృక్షరక్షణకి బద్ధకంకణం ధరించిన వికృతాకృతులతో నవ్యరూపాలు వింత ధ్వజాలతో మానవ పతనాన్ని స్ఫురింపజేసే భయంకర నినాదాలతో 'హరోం హరోం హర .హరహర . హరహర' మంటూ హృదంతరాళం గర్జిస్తూ వొస్తున్నాయి. అవుగో వినబడుతున్నాయి గావుకేకలు. ప్రేక్షకా నిరీక్షించి పరీక్షించు నిర్దాక్షిణ్యంగా ఈ వృక్షాలే నిన్ను కక్షకట్టి చీల్చి చెండాడి శిక్షించి భక్షిస్తాయి. ఆహా ! ఏమి యవనికాశేషం. అదిగో ప్రకృతి నిట్టూర్చింది మేఘాలు గర్జించేయి. అది శేషువు బుజం మార్చేడు. విశ్వం కంపించింది. కాలసర్పం పడగవిత్తి జగన్నాధరధం కదిలింది అవిగో రధచక్రాల్ రధచక్రాల్ రధచక్రాల్ రధచక్రాల్ .'

అయ్యర్ కుదుపుకు మెలకువ వచ్చింది. 'కాశీ అయ్యింది వెళ్ళండి సార్' అన్నాడు. అది తుడుచుకుంటూ సర్వర్‌తో 'ఏమిటి వంటలు?' అన్నాను.

'చిక్కుడుకాయ కూర, ములంకాడ సాంబార్' అన్నాడు. టిక్కెట్టు సర్వర్‌కిస్తుంటే చేతులు వణికాయి.

